క్లుప్తంగా

మూడు నామినేషన్లు స్వీకరణ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతి 9వ వార్డు మెంబర్ ఉప ఎన్నికకు బుధవారం మరో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. గుంటక సుబ్బారెడ్డి, వల్లూరి వెంకటశివ, ఆరేపల్లి ప్రవీణ్ నామినేషన్లు దాఖలు చేసినట్టు రిటర్నింగ్ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు తెలియజేశారు. గురువారం నామినేషన్లు వేసేందుకు చివరి రోజు అని, శుక్రవారం విత్‌డ్రాలు చేసుకోవచ్చని రిటర్నింగ్ అధికారి తెలిపారు. నామినేషన్లు స్వీకరణ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ ఉన్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు: కట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు కామయ్యతోపునకు చెందిన కొండపల్లి థెరిస్సాకుమారి 2021 సంవత్సరంలో వెలిశల శశికుమార్‌ను కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. థెరిస్సాకుమారి పోరంకిలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తుండగా భర్త శశికుమార్ ప్రైవేటు స్కూల్ టీచర్‌గా పని చేస్తున్నాడు. వీరికి పిల్లలు లేరు. కాగా భర్తతో పాటు అత్త రాజకుమారి అదనపుకట్నం కావాలని వేధిస్తూ థెరిస్సాకుమారిని పుట్టింటికి పంపారు. పెద్దలు నచ్చచెప్పినా అత్తింటివారిలో మార్పు రాలేదు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నేడు మండల పరిషత్ సమావేశం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 3గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వీఆర్‌ఏ మృతి



కంకిపాడు: అనారోగ్యంతో ఉప్పలూరు గ్రామం వీఆర్‌ఏ మృతి చెందాడు. గ్రామానికి చెందిన వీఆర్‌ఏ పోలుకొండ వెంకటేశ్వరరావు (96) తీవ్ర అనారోగ్యంతో మంగళవారం తన నివాసంలో మృతి చెందగా బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని మచిలీపట్నం ప్రత్యేక తహసీల్దార్ టీవీ సతీష్, కంకిపాడు తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఆర్‌ఐ వెంకటరమణ, వీఆర్‌ఓ ఏడుకొండలు, ఇతర వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు దేవరపల్లి జ్యోతి, కొడాలి ప్రసాద్, జుజ్జవరపు బాలయ్య, శ్రీను, శివాజీ, లాం చిట్టిమ్మ సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

సర్వేలో లోపాలు ఉంటే చర్యలు

ఆర్డీఓ విజయ్‌కుమార్



పెనమలూరు: నియోజకవర్గంలో ఓటర్ల సర్వే సక్రమంగా నిర్వహించి ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఆర్డీఓ విజయ్‌కుమార్ అన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సర్వేపై బుధవారం పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో చేస్తున్న సర్వేను సూపర్‌వైజర్లు పరిశీలించాలని ఆదేశించారు. ప్రధానంగా మృతి చెందిన ఓటర్లను గుర్తించటం, డబుల్ ఎంట్రీలు, డోర్ నంబర్లు తనిఖీ చేయాలన్నారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటర్ల జాబితా సర్వేలో లోపాలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తండ్రీకొడుకులపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాత గొడవలను మనస్సులో పెట్టుకుని తండ్రి కొడుకులపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్ 7వ లైన్‌లో మనమాల ఏడుకొండల కుటుంబం నివాసం ఉంటుంది. ఏడుకొండలు ఆటో నడుపుకొని జీవనం సాగిస్తుంటాడు. ఏడుకొండలు ఇంటి పక్కనే సాదుపాటి కనక అనే మహిళ కుటుంబంతో కొంత కాలంగా గొడవలు జరుగుతుండగా పెద్దల మధ్య రాజీ కుదుర్చుకున్నారు. మంగళవారం రాత్రి డ్యూటీ ముగించుకొని ఇంటికి వచ్చిన ఏడుకొండలు తన ఆటోను రోడ్డు పక్కన నిలిపాడు. అయితే కనక కుమారులైన గణేష్, మహేష్‌లు ఏడుకొండలు ఆటోలో కూర్చొని మద్యం తాగుతుండగా, వారికి అడ్డుకున్నాడు. దీంతో గణేష్, మహేష్‌లు నోటికి వచ్చినట్లు ఏడుకొండలను తిట్టడమే కాకుండా ఆటో అద్దాన్ని పగులగొట్టారు. అంతే కాకుండా ఏడుకొండలు కుమారుడిపై దాడి చేయడమే కాకుండా ఇంటి అద్దాలను సైతం పగులగొట్టారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సమరయోధుల త్యాగాలు స్ఫూర్తి

డీఈఓ తాహేరాసుల్తానా



పెనమలూరులో శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమంలో డీఈఓ తాహేరాసుల్తానా

పెనమలూరు: మండల పరిధిలో నాభూమి–నాదేశం కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలలో భాగంగా నాభూమి–నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమంలో డీఈవో తాహేరాసుల్తానా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి దేశభక్తితో మెలగాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుంచుకోవాలని సూచించారు. ఈనెల 15వ తేదీ వరకు గ్రామాల్లో విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. విద్యార్థులతో ప్రమాణం చేయించారు. మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో నామట్టి–నాదేశం కార్యక్రమం ఘనంగా చేశారు. మండల పరిషత్ ఆవరణలో శిలాఫలకం ఏర్పాటు చేసి ముఖ్యనేతలు పేర్లు రాశారు..అమరవీరులు, యుద్ధ వీరులకు నివాళులర్పించారు. స్వచ్ఛమైన నీరు, సారవంతమైన నేల భావితరాలకు అందిస్తామని, పుడమి తల్లిని కాపాడుతామని ఎంపీడీఓ సునీతాశర్మ ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు, ఏవో లోమ శివశంకర్‌రావు, ఎంఈఓ–2 కనకమహాలక్ష్మి, పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వై.దుర్గాభవాని, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పాతపాడులో స్థూపం వద్ద ఎంపీపీ ప్రసన్నకుమారి, సర్పంచి సుజాత

పాతపాడు(విజయవాడరూరల్): దేశంకోసం అమరులైనవారిని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని రూరల్ మండల ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. బుధవారం నాభూమి–నాదేశం, నేల తల్లికి నమస్కారం, అమరవీరులకు వందనం కార్యక్రమం పాతపాడు గ్రామంలో నిర్వహించారు. గ్రామ సర్పంచి దేవగిరి సుజాత ఓంకార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మరీదు బాలకోటేశ్వరావు, ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు, కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు, ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. మొక్కలు నాటారు. పి.నైనవరం గ్రామ సర్పంచి సోమయ్య అధ్యక్షతన పి.నైనవరం గ్రామంలో అమరవీరులకు స్థూపం నిర్మించి జాతికి అంకితం చేశారు. ఉపసర్పంచి చేకూరి శ్రీనివాసరావు స్థానికులు పాల్గొన్నారు. అంబాపురం గ్రామంలో సర్పంచి గండికోట సీతయ్య అధ్యక్షతన కార్యదర్శి పి.భారతి, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు స్థూపం వద్ద నివాళులర్పించారు.



కేసరపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచి లక్ష్మీమౌనిక

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి పంచాయతీ కార్యాలయంలో బుధవారం అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందన కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. శిలాఫలకాన్ని వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారితో కలిసి సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక అవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించిన సర్పంచి జాతీయ జెండాను అవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత సైనికాధికారి సోలే అంతోనిని దుశ్శాలువాలతో సత్కారించారు. మొక్కలు నాటారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ సత్యప్రియ, వార్డు సభ్యులు మూల్పూరి మాధవన్, పంచాయతీ కార్యదర్శి మౌనిక, పలువురు ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అల్లాపురంలో నా భూమి–నా దేశం శిలాఫలకాన్ని సర్పంచి డొక్కు సాంబశివ వెంకన్నబాబు, ఎంపీటీసీ సభ్యురాలు గంతోటి ప్రశాంతి, ఈఓపీఆర్డీ ఏఎస్ఆర్.కోటేశ్వరరావు అవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటారు.



అమరవీరులకు సెల్యూట్ చేస్తున్న సర్పంచ్ జేజమ్మ, పీఆర్ ఏఈ దాస్ తదితరులు



మంతెనలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్



మానికొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీ సీఈవో జ్యోతిబసు, ఉపాధ్యాయులు

ఉంగుటూరు: ప్రజలలో దేశ భక్తిని ప్రేరేపించేందుకు చేపడుతున్న ఆజాదీకా అమృత మహోత్సవ్‌లో ప్రతి ఒక్కరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి వీర్ల జ్యోతిబస్ అన్నారు. జెండా పండుగ కార్యక్రమాలను మానికొండ, నందమూరు, ఉంగుటూరు, వెల్దిపాడు, పాణుకుమాడు, వేమండ గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. మానికొండలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ సీఈవో పాల్గొని అమరవీరుల శిలాఫలకాన్ని ప్రారంభించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మట్టిని చేతిలో పట్టుకుని ప్రతిజ్ఞ చేయించారు. తేలప్రోలులో ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం శ్రీహరి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వైస్ ఎంపీపీ కుసుమ, సర్పంచ్ నిమ్మకూరి స్వర్ణలత, పంచాయితీ కార్యదర్శి రత్నకిషోర్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా 'నా మట్టి–నా దేశం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బ్రిటీష్ పాలకుల నుంచి దేశవిముక్తి కోసం స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న హనుమాన్‌జంక్షన్ ఏరియా నాయకుల పేర్లుతో కూడిన శిలాఫలాకాన్ని బాపులపాడు ఎంఈవో బాలరామ్ సింగ్ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పంచప్రాస్ ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటారు. జెండా వందం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని కోలవెన్ను, మంతెన, మారేడుమాక, ఉప్పలూరు, దావులూరు గ్రామాల్లో నా భూమి–నాదేశం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో శిలాఫలకాలను ఏర్పాటుచేసి దేశానికి అంకితం చేశారు. మంతెనలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి పాల్గొని మొక్కలు నాటారు. ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ టీ ఉదయ్‌భాస్కర్, సర్పంచ్ వీరంకి రమణ, ఎంపీటీసీ బండి శ్రీనివాసరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. దావులూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల ఉద్యానశాఖ అధికారి జోసెఫ్ చందు, సర్పంచ్ కె.లక్ష్మి, ఈఓ శేఖర్, నాయకులు మసిముక్కు సాంబశివరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యూరు: అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నాదేశం కార్యక్రమాన్ని ఉయ్యూరులో ఘనంగా నిర్వహించారు. ఆకునూరులో స్వాతంత్రోద్యమంలో అమరులను స్మరిస్తూ స్థూపాన్ని ఏర్పాటు చేసి మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఉయ్యూరు ఏజీఅండ్‌ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో నాభూమి–నాదేశం ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.శ్రీరామ్ కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు.

గన్నవరం రూరల్: అజాదీకా అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా వీరపనేనిగూడెం ఊర చెరువు వద్ద అమృత్ సరోవర్ కార్యక్రమం సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ, పంచాయతీ రాజ్ ఏఈ దాస్, పంచాయతీ కార్యదర్శి బాపూజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదట శిలాఫలకం ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు నందిపాటి పద్మావతి, ఉపసర్పంచ్ నాగసాంబిరెడ్డి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: తాడిగడప డొంక రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..యనమలకుదురుకు చెందిన ఎండీ.అబిద్ గ్లాస్ వర్కు చేస్తాడు. అతను తన బైక్‌పై తాడిగడప డొంక రోడ్డులో వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో గాయపడి ఆస్పత్రిలో చేరాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

98 మందికి కంటి పరీక్షలు



కంకిపాడు: కంటి వెలుగుతో కంటి సమస్యలు పూర్తిగా దూరమవుతాయని దావులూరు సర్పంచ్ కె.లక్ష్మి అన్నారు. దావులూరు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ 98 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. శిబిరాన్ని సర్పంచ్ కె.లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఓ.జ్యోతిర్మయి, ఏఎన్ఎం ఎం.జ్యోతిరాణి, ఆశలు కె.శారద, బి.విజయలక్ష్మి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన ఉండాలి



పెనమలూరు: అవయవ దానంపై ప్రతి ఒక్కరూ అవాహన పెంచుకోవాల నిఆయుష్ ఆస్పత్రి ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్ కేకేడీ సురేఖ అన్నారు. ఈ నెల 13వ తేదీన అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా కానూరు పీబీపీ సిద్ధార్థ కాలేజీలో బుధవారం జరిగిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అవయవదానం చేయటం వలన ప్రాణాపాయస్థితిలో ఉన్న ఇతరుల ప్రాణాలు కాపాడవచ్చన్నారు. అవయవ దానం చేసేవారు ముందుగా వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఈసీఈ విభాగాధిపతి సుబ్బారావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మి, ప్రొఫెసర్ డాక్టర్ టి.హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ చర్యలు చేపట్టండి

జిల్లా వైద్యాధికారిణి గీతాబాయ్



ఉయ్యూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ

పెనమలూరు: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మందు బిళ్లలు ఉచితంగా పంపిణీ చేయనున్నామని జిల్లా వైద్యాధికారిణి జి.గీతాబాయ్ అన్నారు. ఆమె బుధవారం మండల పరిధిలో వివిధ పాఠశాలలు సందర్శించి జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం విజయవంతం చేయాని పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. ఈ సందర్భంగా గీతాబాయ్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. 1–19 సంవత్సరాల వయస్సు కలిగిన వారు నులిపురుగుల నివారణ మందు బిళ్లలు వేసుకోవాని సూచించారు. నులిపురుగులు నివారిస్తే రక్తహీనత లేకుండా చేయవచ్చని వివరించారు. వైద్యుడు ఎస్.రవికుమార్, సీహెచ్‌ఓ లక్ష్మయ్య, సూపర్‌వైజర్లు పురుషోత్తమరాజు, కేవీ.రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగు నివారణపై అవగాహన ర్యాలీ

ఉయ్యూరు: నులి పురుగు నివారణ మాత్రలు విధిగా విద్యార్థులు వేసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ తేజస్విని కోరారు. డీ వార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు నులి పురుగు నివారణ ఆవశ్యకత తెలుపుతూ బుధవారం ఉయ్యూరులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ నులి పురుగులను నిర్మూలిస్తేనే ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించి ప్రతి ఒక్కరూ నులి పురుగు నివారణ మాత్రలు వేసుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే డాక్టర్ రాధ హత్య?



ఘటనాస్థలంలో డాక్టర్ రాధ మృతదేహం (ఫైల్)

కోనేరుసెంటర్(మచిలీపట్నం): డాక్టర్ రాధ హత్య కేసులో అయిన వాళ్లే హంతకులా..? పథకం ప్రకారమే ఆమెను హత్య చేశారా..? ఆరు పదుల వయసులో ఆమెను అంత క్రూరంగా కొట్టి చంపింది అతి దగ్గరి వారేనా..? అన్న కోణంలో పోలీసుల దర్యాప్తు సాగుతోంది. ఈ క్రమంలో వెలుగులోకి వస్తున్న వాస్తవాలు ఆమెది పథకం ప్రకారం జరిగిన హత్యేనని రుజువు చేస్తున్నాయని సమాచారం. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు పక్కా ఆధారాలతో హంతకులను అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టేందుకుందుకు శ్రమిస్తున్నారు.

సంచలనం రేపిన హత్య

మచిలీపట్నంలో గత నెల 25వ తేదీన జరిగిన డాక్టర్ మాచర్ల రాధ (59) హత్య సంచలనం రేపింది. ఆ రోజు రాత్రి 8.15 గంటల సమయంలో హైదరాబాద్‌లోని కుమార్తెతో ఫోన్‌లో మాట్లాడిన రాధ 10.15 గంటల సమయంలో దారుణ హత్యకు గురైంది. భర్త డాక్టర్ మాచర్ల మహేశ్వరరావు కింది ఫ్లోర్‌లోని క్లినిక్‌లో రోగులను పరీక్షిస్తుండగానే ఈ హత్య జరగడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలు తెలుసుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి అనేక మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. దీంతో ప్రతిభ కలిగిన సీఐ స్థాయి అధికారులను ఎస్పీ జాషువా రంగంలోకి దింపి దర్యాప్తును ముమ్మరం చేయించారు. హత్య జరిగిన రోజు మృతురాలి చేతిలో ఉన్న వెంట్రుకలను హంతకుల ఆధారాల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు.

చిక్కిన కీలక ఆధారాలు!

రాధ హత్యకేసులో పోలీసులకు పలు కీలక ఆధారాలు చిక్కినట్లు తెలుస్తోంది. ఆ ఆధారాలతో రాధ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఉండే వ్యక్తితో పాటు ఆమె కుటుంబానికి చెందిన మరో వ్యక్తిని అనుమానితులుగా గుర్తించారు. విచారణ నిమిత్తం వారిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. రాధను హత్య చేసేందుకు పూనుకున్న వ్యక్తికి ఆ కుటుంబంతో సాన్నిహిత్యం ఉన్న వ్యక్తి ఎందుకు సహకరించాడనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని సమాచారం.

రాధను పథకం ప్రకారమే హత్య చేసినట్లు పోలీసుల విచారణలో దాదాపు తేలిందని సమాచారం. పైపులను బిగించే భారీ రెంచీతో ఆమె తలపై బలంగా కొట్టి అత్యంత క్రూరంగా హతమార్చినట్లు పోలీసులు విషయం సేకరించారు. అయితే ఆమె హత్య ఎందుకు జరిగిందనేది ఇంకా వెల్లడికాలేదని తెలుస్తోంది. హత్యకు పాల్పడిన ఇద్దరు నిందితులూ తమపై పోలీసులకు అనుమానం రాకుండా ఉండేందుకు సినిమా ఫక్కీలో డాక్టర్ రాధ ఒంటిపై ఉన్న బంగారు వస్తువులను తొలగించి సీలింగ్‌లో దాచిపెట్టారని దర్యాప్తులో తేలింది. హత్యకు ఉపయోగించిన రెంచీతో పాటు బంగారు ఆభరణాలను పోలీసులు ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారని సమాచారం.

కమ్యూనిటీ హాలు నిర్మించాలని వినతి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ శివారు విశ్వబ్రాహ్మణ కాలనీలోని కామన్ స్థలంలో కమ్యూనిటీహాలు నిర్మించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. బుధవారం గ్రామ పంచాయతి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణకు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు యర్కారెడ్డి నాగిరెడ్డి, సొసైటీ చైర్మన్ పోలారెడ్డి ప్రభాకరెడ్డి ఆ సమయంలో పంచాయతీ కార్యాలయంలో ఉన్నారు. విశ్వబ్రాహ్మణ కాలనీ సంఘం ప్రతినిధులు రంగు విక్రమ్, సంగోజు భోగేశ్వరావు, నందిగామ కోటేశ్వరరావు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

కేంద్రప్రభుత్వంపై పోరాడాలి



గన్నవరం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలని వ్యవసాయ కార్మిక, రైతు, కౌలురైతు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక, రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, జేసుదాసు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు వల్ల కార్మిక, కర్షక, పేద, మధ్య తరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ ప్రజా వ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు. సంఘాల నేతలు సూరగాని సాంబశివరావు, శ్రీనివాసరెడ్డి, మిరప నాగేశ్వరరావు, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగంపై ఆసక్తి చూపాలి



కానూరులో ఏర్పాటు చేసిన యువటూరిజం క్లబ్‌లో విద్యార్థులు

పెనమలూరు: విద్యార్థులు పర్యాటక రంగంపై ఆసక్తి చూపి నూతన విషయాలు తెలుసుకోవాలని ఇండియన్ టూరిజం నోడల్ ఆఫీసర్ రబిరత్నసేనాపతి అన్నారు. కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం యువ టూరిజం క్లబ్ ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ టూరిజం వలన సంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ మాట్లాడుతూ క్లబ్ ఏర్పాటు చేయటం వలన విద్యార్థులు దేశంలో ముఖ్యమైన ప్రాంతాలు సందర్శించటానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ జాఫర్, ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థు పాల్గొన్నారు.

వైభవంగా కావడి మహోత్సవం



విమాన కావడి నిర్వహిస్తున్న యువకులు

వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సేవా సమితి (తమిళ సంఘం) ఆధ్వర్యంలో విమాన కావడి మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరుని భక్తులు నిర్వహించిన వివిధ రకాల పూజా కార్యక్రమాలు ఒళ్లు గగుర్పాటు కలిగించాయి. వీపునకు కొక్కేలను దించుకొని తాడుపై వేలాడుతూ నిర్వహించిన విమానకావడి భక్తులను తన్మయుల్ని చేసింది. వన్‌టౌన్‌లోని స్థానిక పాడివీధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమిళ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామికి పూజలు నిర్వహించారు. ముగ్గురు యువకుల వీపు భాగానికి కొక్కేలను గుచ్చి, వారు గాలిలో వేలాడే విధంగా తాడుతో కడతారు. క్రేన్ సాయంతో భూమికి 20 అడుగుల ఎత్తులో 50 అడుగుల మధ్య ప్రయాణం చేస్తూ షణ్ముఖునికి పూజ నిర్వహించడమే విమాన కావడిగా పేర్కొంటారు. ఈ విమానకావడిలో మూడు పర్యాయాలు భక్తులు వెనుకకు ముందుకు వెళ్లి వస్తారు. ఈ సందర్భంగా తొలిసారి దండ వేసి పూజ చేయడం, రెండోసారి కొబ్బరికాయ కొట్టి హారతి ఇవ్వడం, మూడో సారి నిమ్మకాయలను మంత్రించి భక్తులపైకి విసరడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు తమ వీపులకు ఇనుప కొక్కేలను తగిలించుకొని వాటితో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి విగ్రహాన్ని ఉంచిన ట్రాక్టర్‌ను లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. పెద్ద సంఖ్యలో తమిళ భక్తులు పన్నీరుకావడి, పాలకావడి, పుష్పకావడి తదితర మొక్కులను స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు పాడివీధిలో ప్రారంభమై తారాపేట రైల్వేస్టేషన్, కాళేశ్వరరావు మార్కెట్ బస్‌టెర్మినల్, గద్దబొమ్మ సెంటర్, కెనాల్‌రోడ్డు మీదుగా కష్టానదికి చేరుకుంది. అక్కడి నుంచి రథం సెంటర్, బ్రాహ్మణవీధి మీదుగా కొత్తపేట కోమలవిలాస్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకొని భక్తులు మొక్కులు చెల్లించారు. సమితి నిర్వాహకులు కే.చిన్నిస్వామి మాట్లాడుతూ సుమారు 50 సంవత్సరాలుగా తమ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్వామి వారి అనుగ్రహంతోనే ఏటా విమాన కావడి మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌స్వామి తమిళ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతికి ప్రతీక చేనేత వస్త్రాలు

పటమట(విజయవాడతూర్పు): విశిష్టమైన భారతీయ సంస్కృతికి చేనేత వస్త్రాలు ప్రతీకలుగా నిలుస్తాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) డైరెక్టర్ ఎం.జానకి అన్నారు. పటమట పంటకాల్వ రోడ్డులోని స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న చేనేత జౌళి శాఖ, ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శనను బుధవారం ఆమె సందర్శించారు. జానకి మాట్లాడుతూ అపురూపమైన నైపుణ్యత, సృజనాత్మకతతో చేనేత కార్మికులు అహర్నిశలు కష్టపడి ఇంద్రధనస్సు వంటి చేనేత వస్త్రాలను తయారు చేస్తున్నారని చెప్పారు.వాటిని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. చేనేత జౌళి శాఖ, ఆప్కో ఈ తరహా ప్రదర్శనలు ఏర్పాటు చేయటం నేత కార్మికులకు ఎంతో ఉపయోగకరమన్నారు.ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజైనా నేత దుస్తులను ధరించాలని కోరారు. ఆప్కో జీఎం తనూజారాణి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెనమలూరు డివిజన్

90105 77706 (ఉయ్యూరు)

99122 20539 (పెనమలూరు)

90102 10382 (గన్నవరం)

Office mail : sakshiads@gmail.com